# పుష్పరాజ్ మేనియా షురూ



దేశవ్యాప్తంగా 'పుష్ప-2' మేనియా మొదలైంది. సరికొత్త అప్‌డేట్‌లను అందిస్తూ చిత్ర బృందం ప్రచారంలో జోరు పెంచింది. సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ ఎమోషనల్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ఆగస్ట్ 15న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. విడుదలకు ఇంకా మూడు మాసాలకుపైగా సమయం ఉండటంతో ఈ సినిమాకు సంబంధించిన ప్రతి అప్‌డేట్ అభిమానుల్లో ఉత్సుకతను పెంచుతున్నది. మ్యూజిక్ ప్రమోషనల్‌లో భాగంగా 'పుష్ప..పుష్పరాజ్' అంటూ సాగే తొలి లిరికల్ వీడియోను నేడు విడుదల చేయబోతున్నారు. ఈ సందర్భంగా మంగళవారం కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో అల్లు అర్జున్ మాస్ గెటప్‌లో దర్శనమిస్తున్నారు. దేవిశ్రీప్రసాద్ స్వరాలందించిన ఈ సినిమా గీతాలు తొలిభాగం తరహాలోనే సంగీత ప్రియులను ఉర్రూతలూగిస్తాయని మేకర్స్ చెబుతున్నారు. రష్మిక మందన్న, ఫహాద్ ఫాజిల్, ధనుంజయ్, సునీల్, అనసూయ భరద్వాజ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: మిరోస్లా క్యూబో బ్రోజెక్, సంగీతం: దేవిశ్రీప్రసాద్, నిర్మాతలు: నవీన్ ఏర్నేని, వై.రవిశంకర్, కథ, కథనం, దర్శకత్వం: సుకుమార్.బి.

## నటించను.. ఇలాగేవుంటా.. నీకేమైనా ఇబ్బందా?



నటి మాళవిక మోహనన్‌కి కోపం వచ్చింది. ఈ ముద్దుగుమ్మకు ఖాళీ సమయంలో అభిమానులతో ముచ్చటించడం సరదా. ఈ కారణంగానే తన ఎక్స్(ట్విటర్)లో 'ఆస్క్ మాళవిక' పేరుతో క్వశ్చన్ అండ్ ఆన్సర్ సెషన్ నిర్వహించింది. మరి ప్రశ్నించేవారంతా బుద్ధిమంతులు కారుకదా.. వారిలో ఓ తుంటరి నెటిజన్ తన ప్రశ్నతో మాళవికను అసహనానికి లోను చేశాడు. 'ఎప్పుడూ గ్లామర్ షోనేనా? నటించడం ఏమైనా ఉందా?' అని అడగడంతో ఈ ముద్దుగుమ్మకు మండుకొచ్చింది. 'నేను నటించను.. ఇలాగే ఉంటాను.. నీకేమైనా ఇబ్బందా?' అంటూ ఆవేశంగా బదులిచ్చింది. దీంతో మిగతా వారంతా మాళవికను శాంతింపజేసేందుకు ప్రయత్నించారు. 'అలాంటివారికి సమాధానం చెప్పకండి?' అని ఒకరు.. 'బాధపడకండి మేడమ్..' అంటూ ఒకరు మాళవికను ఓదార్చారు. ఈ సెషన్‌లో మాళవిక చాలా ప్రశ్నలకు సమాధానాలిచ్చింది. రజనీకాంత్ 'తంగలాన్'లో తన పాత్రకు తానే డబ్బింగ్ చెప్పుకున్నాననీ, ప్రేక్షకుల స్పందన కోసం ఎదురు చూస్తున్నానని మాళవిక చెప్పింది. హైదరాబాద్ ఫుడ్ అంటే తనకు ఇష్టమని, అనుష్కశెట్టి, సమంత తనకు ఇష్టమైన హీరోయిన్లనీ, తన తొలి సెలబ్రిటీ క్రష్ హృతిక్ రోషన్ అని ఈ ఇంటర్వ్యూలో తెలిపింది మాళవిక.

# ఇప్పుడైతే నాకెలాంటి కోరికలు లేవు



ఉత్తమమైన కోరికలు మనిషిని ఉన్నతుడ్ని చేస్తాయి. అబ్దుల్ కలాం కూడా కలలు కని, వాటిని సాకారం చేసుకోమన్నారు. అయితే.. చాలామంది కలలైతే కంటారు కానీ, వాటిని నిజం చేసుకునే ప్రయత్నాలు మాత్రం చేయరు. కమల్ అందుకు మినహాయింపు. ఇటీవల తన కుమార్తె శ్రుతీహాసన్‌తో నిర్వహించిన ఇంటర్వ్యూలో చిన్నవయసులో తన కోరికల చిట్టా గురించి మాట్లాడారు. పనిలో పనిగా బాలీవుడ్ సూపర్‌స్టార్ షారుక్ కోరికల గురించి కూడా ఫన్నీ కామెంట్స్ చేశారు. 'చిన్నప్పుడు మా ఇంట్లోనే నాకు ఓ గదిని కేటాయించారు మా నాన్న. నేను తెలివైన వాడ్ని అని ఆయన ప్రగాఢ నమ్మకం. నేనేమో ఆ గదిలో ఒంటరిగా పడుకొని కలలు కనేవాడ్ని. ఎలాగైనా పెద్దయ్యాక నెలకు ఓ పదివేలు జీతం వచ్చే ఉద్యోగం చేయాలని, కారు కొనాలనీ, కొడై కెనాల్‌లో ఇల్లు కట్టాలనీ.. ఇవన్నీ చేయాలంటే ఏంచేయాలి? అంటూ ఆలోచిస్తూ అలాగే నిద్రపోయేవాడ్ని. పెద్దయ్యాక బాగా సంపాదించా. కావల్సినంత డబ్బు, లగ్జరీ లైఫ్ అన్నీ పొందా. కొడైకెనాల్‌లో భవంతి విషయంలో మాత్రం పునరాలోచించాల్సి వచ్చింది. ఎందుకంటే.. నా వర్క్ అంతా చెన్నయ్‌లో. కొడైకెనాల్ వెళ్లినా ఎక్కువ రోజులు ఉండే అవకాశం లేదు. అలాంటప్పుడు అక్కడ ఇల్లెందుకు? అందుకే విరమించుకున్నా. ఇప్పుడైతే నాకెలాంటి కోరికలూ లేవు' అని తెలిపారు. షారుక్ గురించి మాట్లాడుతూ 'చిన్నతనంలో షారుక్ కోరికల లిస్ట్‌ను ఇటీవలే అతని ఇంటర్వ్యూలో విని ఆశ్చర్యపోయాను. తనది నాకంటే పెద్ద లిస్ట్. తనకు విమానం కొనాలని ఉండేదట. అది విని నవ్వుకున్నాను. నిజానికి అతనికి విమానం అక్కర్లేదు. కానీ ఓ గోల్‌గా పెట్టుకున్నందుకు అభినందించాలి' అన్నారు కమల్‌హాసన్.

# స్టార్ల సమాహారంగా థగ్‌లైఫ్



'నాయకుడు' సినిమా వచ్చి 37ఏళ్లయింది. సుదీర్ఘ విరామం తర్వాత కమల్‌హాసన్‌తో చేయి కలిపారు మణిరత్నం. వారిద్దరి కలయికలో రూపొందుతోన్న చిత్రం 'థగ్‌లైఫ్'.ఎలాగైనా హిట్ కొట్టాలనే కసితో మణిరత్నం సినిమాను తెరకెక్కిస్తున్నట్టు సమాచారం. ఈ హిస్టారికల్ డ్రామాలో త్రిషాకృష్ణన్ కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. అత్యంత ప్రతిష్టాత్మకంగా పాన్ ఇండియా స్థాయిలో కమల్‌హాసన్, మణిరత్నం, ఆర్.మహేంద్రన్, శివ అనంత్‌లు కలిసి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. దుల్కర్‌సల్మాన్, జయం రవి, నాజర్, ఐశ్వర్య లక్ష్మి, గౌతం కార్తీక్ ఇందులో ప్రధానపాత్రధారులు. తాజా సమాచారం ప్రకారం హీరో శింబు కూడా ఇందులో భాగమైనట్టు తెలుస్తున్నది. అలాగే, దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 'మీర్జాపూర్' వెబ్‌సిరీస్‌లో ప్రధాన పాత్రధారులైన పంకజ్ త్రిపాఠి, అలీ ఫజల్ కూడా ఇందులో నటిస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం. ఇంతమంది భారీ తారాగణం చేరడం ఈ సినిమా క్రేజ్ మరింత పెరగడానికి దోహదపడుతుందని చెప్పకతప్పదు.

# సీరియస్ సమస్యకి కామెడీ పరిష్కారం

'పెళ్లి ఎప్పుడు చేసుకోవాలి? ఏ వయసులో చేసుకోవాలి? ఎంత శాస్త్రోక్తంగా చేసుకోవాలి? జీవిత భాగస్వామిని ఎంచుకునే విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలేంటి? ఈ ప్రశ్నలపై నేటి యువతకు అవగాహన శూన్యం. పెళ్లి వ్యక్తిగతమే అయినా.. సమాజానికి మాత్రం అది పెద్ద సమస్య. పక్కోడికి పెళ్లి కాకపోతే పొరుగువాడికి ఆనందం. పైగా బాధితుడు కనిపిస్తే 'సెటిల్ అయ్యావా?' అని అడిగి, వాడ్ని బాధపెట్టి ఆనందపడే సమాజంలో మనం ఉన్నాం.




'సెటిల్ అవ్వడమంటే ఉద్యోగం, పెళ్లి కాదు. మనకు ఓ అవసరం వచ్చినప్పుడు పక్కవాడి దగ్గర చేయి చాచకపోవడం' ఈ సినిమాలో నేను రాసిన డైలాగ్ ఇది. మొత్తంగా ఈ నేపథ్యంలోనే ఈ కథ నడుస్తుంది' అన్నారు రచయిత అబ్బూరి రవి. వినోద ప్రధానంగా అల్లరి నరేశ్ నటించిన చిత్రం 'ఆ ఒక్కటీ అడక్కు'. ఫరియా అబ్దుల్లా కథానాయిక. మల్లి అంకం దర్శకుడు. రాజీవ్ చిలక నిర్మాత. మే 3న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్రానికి మాటలు రాసిన అబ్బూరి రవి విలేకరులతో మాట్లాడారు. 'పెళ్లి ప్రస్తుతం సీరియస్ ఇష్యూ. పెళ్లికాకపోవడంతో మానసికంగా కృంగుబాటుకు గురైన వారున్నారు. ఆత్మహత్యకు తెగబడ్డవాళ్లూ ఉన్నారు. ఇలాంటి సబ్జెక్ట్‌ని వినోదాత్మకంగా చెబుతూనే, అందులోని ఎమోషన్స్ కనెక్ట్ అయ్యేలా చేశాం. దర్శకుడు మల్లీ ఈ టైటిల్ చెప్పినప్పుడు భయం వేసింది. ఈవీవీగారి క్లాసిక్ టైటిల్.. ఇంత పెద్ద టైటిల్ అవసరమా? అనిపించింది. ఒకటికి రెండుసార్లు చెక్ చేసుకున్న తర్వాతే ఓకే అన్నాను.' అని పేర్కొన్నారు అబ్బూరి రవి. కంటెంట్‌లో మేటర్ ఉంటే కామెడీ అద్భుతంగా రాయొచ్చనీ, ఇందులో అంతా సిట్యూవేషనల్ కామెడీనే ఉంటుందని ఆయన తెలిపారు. ఎలాంటి పాత్రనయినా చేసి మెప్పించగలిగేంత మంచి నటుడు అల్లరి నరేశ్ అనీ, దర్శకుడు మల్లీ ప్రతిభగల దర్శకుడనీ, సినిమాను జనరంజకంగా తెరకెక్కించాడని, చిలకా రాజీవ్ రాజీలేని నిర్మాణ విలువలు తెరపై కనిపిస్తాయని, ప్రతిఒక్కరికీ నచ్చే సినిమా ఇదని అబ్బూరి రవి నమ్మకం వ్యక్తం చేశారు.

# ఆర్ట్ మేకర్స్ ప్రొడక్షన్ చిత్రం



ఆర్ట్ మేకర్స్ సంస్థ నిర్మిస్తున్న తొలి చిత్రం ఇటీవల హైదరాబాద్‌లో ప్రారంభమైంది. రవితేజ మహాదాస్యం కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రం ద్వారా మద్దుల మదన్‌కుమార్ దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. సౌజన్య కావూరి నిర్మాత. ముహూర్తపు సన్నివేశానికి హీరో విరాజ్‌అశ్విన్ క్లాప్‌నివ్వగా, పురాణపండ శ్రీనివాస్ కెమెరా స్విఛాన్ చేశారు. వినూత్న కథాంశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నామని దర్శకుడు తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: నితిన్ రెడ్డి చిమ్ముల, సంభాషణలు, పాటలు: జక్క రాజశేఖర్ రెడ్డి, దర్శకత్వం: మదన్‌కుమార్ మద్దుల.



# ఏమయ్యిందే గుండెకు..

'ఏమయ్యిందే గుండెకూ.. ఏనాడు లేదే ఇంత ఉలుకు..' అంటూ ప్రియురాలిని తలచుకొని తన్మయంలో మునిగి తేలుతున్నాడు యువహీరో గల్లా అశోక్. తాను నటిస్తున్న తాజా చిత్రం 'దేవకీ నందన వాసుదేవ'లోని పాట ఇది. తొలి చిత్రం 'హీరో'లో తన ఎనర్జీతో ప్రేక్షకుల్ని మెస్మరైజ్ చేసిన గల్లా అశోక్, మరింత హ్యాండ్సమ్‌గా మారి ఈ సినిమాలో కనిపిస్తున్నాడు. ఇందులో కథానాయిక వారణాసి మానస. అర్జున్ జంధ్యాల దర్శకుడు. సోమినేని బాలకృష్ణ నిర్మాత. ఈ సినిమా నిర్మాణం చివరి దశకు చేరుకుంది. మేకర్స్ ప్రమోషన్ స్టార్ట్ చేశారు. అందులో భాగంగా 'ఏమయ్యిందే గుండెకూ..' పాట ప్రోమోను విడుదల చేశారు. భీమ్స్ సిసిరోలియో ఆకట్టుకునే ట్యూన్‌తో ఈ పాటను స్వరపరిచారని, హీరోకు హీరోయిన్‌పై ఉండే ఆరాధనను వ్యక్తం చేసేలా ఈ పాట సాగుతుందని, ఈ పాటలో గల్లా అశోక్ అనందంగా కనిపిస్తుంటే, వారణాసి మానస అందంగా కనిపిస్తున్నదనీ, పూర్తి పాటను మే 3న విడుదల చేస్తామని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి మాటలు: సాయిమాధవ్ బుర్రా, కెమెరా: ప్రసాద్ మూరెళ్ల.

# అవకాశాలు అందుకే తగ్గాయి



ఒకప్పుడు ఇలియానా అంటే కుర్రకారు కలల సుందరి. ఓ అయిదారేళ్లు తెలుగుతెరపై తన హవా నడిచిందని చెప్పొచ్చు. కానీ ఉన్నట్టుండి తెరమరుగైపోయింది. ఈ విషయంపైనే ఇటీవల ఓ ఇంటర్వ్యూలో వివరణ ఇచ్చింది ఇలియానా. ' 2006లో నా 'దేవదాసు' విడుదలైంది. అప్పట్నుంచీ ఆరేళ్ల పాటు తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీలో నేను బిజీ బిజీ. 2012లో 'బర్ఫీ' రూపంలో బాలీవుడ్ నుంచి పిలుపు వచ్చింది. మంచి అవకాశం.. వదులుకోకూడదని ఓకే చెప్పేశాను. ఆ సినిమా విడుదలై మంచి విజయాన్ని సాధించింది. ఓ విధంగా నేను పరిశ్రమలో వెనుకపడిపోవడానికి కారణం 'బర్ఫీ'నే. ఆ సినిమా విజయం సాధించడం వల్ల, ఇక నేను తెలుగులో నటించనని టాలీవుడ్ దర్శక, నిర్మాతలు ఫిక్స్ అయిపోయారు. దాంతో నాకు రావాల్సిన అవకాశాలు వేరొకరికి వెళ్లిపోయాయి. అందరూ అనుకున్నట్టే బాలీవుడ్‌లో నాకు మంచి అవకాశాలే వచ్చాయి. కానీ, నేను ఏ పాత్ర ఒప్పుకున్నా వంద శాతం ఆ పాత్రకు న్యాయం చేయాలని కోరుకుంటాను. అందుకే.. పాత్రల్ని సెలక్టివ్‌గా ఎంచుకోవడం మొదలుపెట్టాను. ఈ క్రమంలో వచ్చిన మంచి అవకాశాలను కూడా వదులుకున్నా. ఆ సమయంలో నేను వదులుకున్న బాలీవుడ్ సినిమాలు బాగా ఆడి, అందులో నటించిన వాళ్లకు మంచి పేరు తెచ్చాయి. కాలక్రమేణా, బాలీవుడ్‌లో కూడా నాకు అవకాశాలు తగ్గాయి. ఇదంతా తలరాత అంతే.. విద్యాబాలన్, నేను కలిసి నటించిన 'దో ఔర్ దో ప్యార్' చిత్రంతో చాలా విరామం తర్వాత నాకు సక్సెస్ వచ్చింది. ప్రస్తుతం ఆ ఆనందంలో ఉన్నాను.' అంటూ చెప్పుకొచ్చింది గోవాభామ ఇలియానా.

# అదే మంచి నిర్ణయం



కెరీర్ ఆరంభంలో కథానాయిక తాప్సీ పేరు వింటే గ్లామర్ పాత్రలే గుర్తుకొచ్చేవి. దక్షిణాది సినిమాలకు విరామం తీసుకొని పూర్తిగా బాలీవుడ్‌పై దృష్టిపెట్టిన తర్వాతే ఈ భామ ప్రయోగాత్మక కథాంశాల్లో మెప్పించింది. ముఖ్యంగా పింక్, నామ్ షబానా, ముల్క్ వంటి చిత్రాలు ఆమెకు తిరుగులేని గుర్తింపును తీసుకొచ్చాయి. అతి తక్కువ సమయంలోనే హిందీ చిత్రసీమలో మహిళా ప్రధాన చిత్రాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిపోయింది తాప్సీ. లేడీ ఓరియెంటెడ్ చిత్రాలను ప్రేక్షకులు ఆదరించడం వల్లే తాను బాలీవుడ్‌లో నిలదొక్కుకున్నానని, లేకుంటే పదేళ్ల క్రితమే కెరీర్ ముగిసిపోయేదని తాప్సీ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పేర్కొంది. ఆమె మాట్లాడుతూ 'ప్రేక్షకులు లేడీ ఓరియెంటెడ్ కథలను ఆదరించే ధోరణి క్రమంగా పెరుగుతున్నది. ఇదొక శుభపరిణామం. ది డర్టీ పిక్చర్, కహానీ, క్వీన్ లాంటి సినిమాలు మహిళా ప్రధాన కథలను ఎంచుకోవడానికి ప్రేరణనిచ్చాయి. ఇండస్ట్రీలో నేను సక్సెస్ కాగలననే నమ్మకాన్ని ఇచ్చాయి. 'పింక్' చిత్రంతో కథల ఎంపికలో నా పంథా మార్చుకున్నా. నా కెరీర్‌లో అదే అత్యుత్తమ నిర్ణయం. అప్పటి నుంచే నటిగా నా ప్రతిభ ప్రపంచానికి తెలిసింది' అని చెప్పింది. ప్రస్తుతం తాప్సీ హిందీలో మూడు చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది.



# వినోదాల 'బ్రహ్మచారి'

మల్లేశం హీరోగా నటించిన చిత్రం 'బ్రహ్మచారి'. నర్సింగ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని రాంభూపాల్ రెడ్డి నిర్మించారు. ఈ నెల 10న ప్రేక్షకుల ముందుకురానుంది. మంగళవారం ప్రీరిలీజ్ వేడుకను నిర్వహించారు. నిర్మాత మాట్లాడుతూ 'తెలంగాణ నేపథ్యంలో నడిచే కామెడీ కథ ఇది. ప్రతి సన్నివేశం సహజంగా ఉంటుంది. ఊరిలో రచ్చబండ దగ్గర కూచుని మాట్లాకున్నట్లే అనిపిస్తుంది' అన్నారు. ఆద్యంతం ప్రేక్షకుల్ని నవ్విస్తుందని దర్శకుడు పేర్కొన్నాడు. స్వప్న, సిరి, రోషిణి, రజాక్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: కర్ణ ప్రియాసన్, సంగీతం: పాండురంగ, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: నర్సింగ్.